# బీఆర్ఎస్, బీజేపీలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు

## ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60.62 కోట్లతో విద్యుత్ పనులు
## పల్లగుట్ట భారీ బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి వెల్లడి



జనగామ/స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 09(వుదయం ప్రతినిధి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రూ. 60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు, నూతన సబ్ స్టేషన్లకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారని ఆరోపించారు. ఆ అప్పుల వడ్డీల కోసమే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్లు కట్టాల్సి వస్తోందన్నారు. డిస్కంలను అప్పులపాలు చేసింది గత ప్రభుత్వమేనని.. తాము అధికారంలోకి వచ్చాక రూ. 19 వేల కోట్లు నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నామని చెప్పారు. కేవలం వార్తల్లో ఉండటం కోసమే హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే రూ. 5 లక్షల ఉచిత బీమా.. తమ ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసమే పనిచేసే 'ఇందిరమ్మ రాజ్యం' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా కల్పిస్తామని, ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని చెప్పారు. రూ. 22,500 కోట్లతో తొలి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కేంద్రం కొన్నా కొనకపోయినా రైతుల చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఒకప్పుడు వలసల ప్రాంతంగా ఉన్న ఘన్‌పూర్, దేవాదుల ప్రాజెక్టు మరియు ఉచిత విద్యుత్ వల్ల వ్యవసాయ వరంగా ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. రఘునాథపల్లి 132 కేవీ సబ్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, లైన్ షిఫ్టింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిప్యూటీ సీఎంను కోరగా.. భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీలు మాట్లాడుతూ.. రూ. 60.62 కోట్ల విద్యుత్ పనుల ద్వారా లోడ్ మేనేజ్‌మెంట్ మెరుగుపడి, విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉంటుందని వివరించారు.

# కోటగుళ్లలో ఎస్ఐ సాంబమూర్తి ప్రత్యేక పూజలు



జయశంకర్ భూపాలపల్లి జూన్ 09(వుదయం జిల్లా ప్రతినిధి): భూపాలపల్లి ఎస్ఐ గా పనిచేస్తూ మహాదేవపూర్ ఎస్ హెచ్ ఓ గా బదిలీపై వెళ్తున్న మచ్చ సాంబమూర్తి మంగళవారం ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బండి మణెమ్మ కు ఘన సన్మానం

## – నేపాల్ అంతర్జాతీయ సదస్సుకు ఖాజీపేట కమ్యూనిటీ నాయకురాలు బండి మానెమ్మ ఎంపిక!



హనుమకొండ, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : దక్షిణాసియా దేశాలలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (ఔూూ) రంగాలలో పనిచేస్తున్న ప్రముఖ సంస్థ 'ఫ్యాన్సా' (ఖీూచీూూ) ఆధ్వర్యంలో నేపాల్ రాజధాని ఖాట్మండులో నిర్వహించనున్న "గ్రాస్‌రూట్స్ అసెంబ్లీ -- 2026" అంతర్జాతీయ సదస్సుకు వక్తగా ఖాజీపేటకు చెందిన ప్రముఖ కమ్యూనిటీ నాయకురాలు బండి మానెమ్మ ఎంపికయ్యారు. జూన్ 12, 13 తేదీలలో జరగనున్న ఈ సదస్సుకు ఆమెకు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ నేపథ్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బండి మానెమ్మను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఔవీజ) పరిధిలో సెప్టిక్ ట్యాంక్ డీ-స్లడ్జింగ్ అంశంలో కమ్యూనిటీ భాగస్వామ్యంతో సాధించిన విజయవంతమైన అనుభవాలను అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. "దీవ నావవఅ, దీవ ఎముఖీఎ, నాముఎ జష్ఘుఅస్త్రవ" అనే నినాదంతో జరిగే ఈ సదస్సులో వివిధ దేశాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విధాన నిర్ణేతలు పాల్గొననున్నారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణకు, ముఖ్యంగా వరంగల్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి మానెమ్మకు అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో +ఔవీజ ప్రధాన వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజా రెడ్డి, ఖీూచీూూ రాష్ట్ర కన్వీనర్ మండల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య



నర్సంపేట జూన్ 09 (వుదయం ప్రతినిధి) : నర్సంపేట పట్టణంలోని జిల్లా స్థాయి మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ గా డా. సంధ్య నియమితులయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్టాఫ్ ఏడీ సాజిద్ అలీ, ఆఫీస్ సూపరెండెంట్ , టీ. ఎన్.జీ.ఓ స్టేట్ ఈసీ మెంబర్ ఎండీ. మొయిజుద్దీన్ , ఆఫీస్ సూపరెండెంట్ రవీందర్ తదితరులు నూతన ప్రిన్సిపల్ కి బొకే అందజేసి ఆహ్వానించారు.

# అధికారుల నిర్లక్ష్యంతో హతమవుతున్న హరితహారం మొక్కలు

## చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

పరకాల జూన్ 9 (వుదయం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా పరకాల పట్టణ ప్రధాన రహదారుల డివైడర్లలో నాటిన మొక్కలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. మొక్కలు నాటడానికే పరిమితమైన అధికారులు, వాటి సంరక్షణపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రధాన రహదారుల డివైడర్లలో నాటిన అనేక మొక్కలకు రక్షణ కంచెలు లేకపోవడంతో పాటు, క్రమం తప్పకుండా నీరు అందించడం కూడా జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు లేక చాలా మొక్కలు ఎండిపోతున్నాయి. గత సంవత్సరం నాటిన మొక్కల్లో దాదాపుగా సగానికి పైగా నీరు లేక ఎండిపోయి చనిపోయిన వృక్షాలను చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారుల తీరు పరకాల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సంవత్సరంలో వేసవి ప్రారంభం నుంచి మొక్కలను పట్టించుకున్న నాథుడే లేడు. హరితహారం లక్ష్యం కేవలం



మొక్కలు నాటడమే కాకుండా వాటిని చెట్లుగా పెంచడమని ప్రజలు గుర్తు చేస్తున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో నాటిన మొక్కలు సంరక్షణ లేక నశిస్తుండటంతో కార్యక్రమం ఉద్దేశ్యం నీరుగారిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డివైడర్లలోని మొక్కలకు రక్షణ చర్యలు చేపట్టి, క్రమం తప్పకుండా నీరు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. లేకపోతే హరితహారం కింద నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మొక్కల సంరక్షణలో భాగంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా జూన్ 09 (వుదయం ప్రతినిధి) : ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు వరంగల్ ఐఎంఏ హాల్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో బయోమెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కీలకమని అన్నారు. ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, నిర్దేశిత రంగుల కవర్లు, డబ్బాల్లో నిల్వ చేయడం, సురక్షితంగా తరలించి నిర్వీర్యం చేయడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా పాటించాలని, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు వ్యక్తిగత భద్రతా చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, రంగుల వారీగా వ్యర్థాల నిల్వ, సేకరణ, రవాణా, నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల గురించి సవివరంగా వివరించారు. పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగుల కవర్లు, డబ్బాల్లో వేర్వేరు రకాల వ్యర్థాలను వేరు చేసి నిల్వ చేయాల్సిన విధానం, పదునైన వ్యర్థాల నిర్వహణ, సోడియం హైపోక్లోరైట్ వినియోగం, వ్యర్థాల సురక్షిత నిల్వపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో వ్యర్థాలు ఎక్కువసేపు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీత, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా అధికారులు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నరేష్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐకెపి ద్వారా 24 వేల 990 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు

## రైతుల ఖాతాలో డబ్బులు జామ.
## చైతన్య మండల సమైక్య ఏపిఎం రమాదేవి.



ఖానాపురం, జూన్ 9 (వుదయం ప్రతినిధి): మండలంలోని ఐకెపి ద్వారా రాగంపేట, అయోధ్యనగర్ గ్రామాలలోని రెండు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో 24 వేల 990 ధాన్యం బస్తాలను రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు చైతన్య మండల సమైక్య ఏపీఎం రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఐకెపి కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, అయోధ్యనగర్ కొనుగోలు కేంద్రం ద్వారా 12 వేల 117 వరి ధాన్యం బస్తాలను 106 మంది రైతుల వద్ద కొనుగోలు చేసి 98% రైతులకు ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమైనట్లు తెలుపుతూ, రాగంపేట కొనుగోలు కేంద్రం ద్వారా 12 వేల 874 ధాన్యం బస్తాలను 119 రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతున్నట్లు ఏపీఎం తెలుపుతూ, అయోధ్యనగర్, రాగంపేట కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసిన రెండు కొనుగోలు కేంద్రాల ఇన్చార్యులు ఎల్లబోయిన మంజుల, వరంగట్టి రజితతో పాటు కమిటీ సభ్యులకు ఏపిఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గంజాయి మత్తులో జీవితలు నాశనం చేసుకోకండి

## గంజాయి సమాచారం అందించండి,
## మహబూబాబాద్ సిగ్నల్ కాలనీలో గంజాయి నివారణపై అవగాహన కార్యక్రమం. 5000/- వరకు నగదు బహుమతి పొందండి.
## -ఎస్పీ. శబరీష్,




మహబూబాబాద్ జిల్లా జూన్ 09 (వుదయం ప్రతినిధి),: గంజాయి రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ఈరోజు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ , టౌన్ సీఐ రఘుపతి రెడ్డి మరియు పోలీస్ సిబ్బందితో కలిసి మహబూబాబాద్ పట్టణంలోని సిగ్నల్ కాలనీలో పర్యటించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు గంజాయి వల్ల కలిగే అనర్థాల గురించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన పోస్టర్లను స్వయంగా ఎస్పీ విడుదల చేసి, కాలనీలోని గోడలకు అతికించడం జరిగింది. గంజాయి వాడకం వల్ల మెదడు దెబ్బతినడం, ఆలోచనా శక్తి తగ్గడం, శ్వాసకోశ సమస్యలు, డిప్రెషన్ వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు



వస్తాయని మరియు ఇది చదువు, ఉద్యోగం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ వివరించారు. గంజాయిని గుర్తించే విధానం, అంటే ఎండిన ఆకులు, పువ్వులు లేదా మొక్క భాగాల రూపంలో ఉండి, 5-7 దంతాల అంచులను కలిగి, ప్రత్యేకమైన ఘాటైన వాసనతో ఉంటుందని పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియజేశారు. గంజాయికి సంబంధించిన ఎటువంటి అనుమానాస్పద సమాచారం ఉన్నా, వెంటనే 8712656999 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, సరైన సమాచారం అందించిన వారికి 5,000 రూపాయల వరకు బహుమతి అందజేయబడుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గంజాయి లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని, దీనికి ప్రజలందరూ బాధ్యతతో సహకరించాలని ఎస్పీ కోరారు.

# ప్రతిభావంతులైన బాలలకు ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

## కలెక్టర్ డాక్టర్ సత్య శారద.




వరంగల్ జిల్లా జూన్ 09 (వుదయం ప్రతినిధి) : దేశ నిర్మాణంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ -2026 కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ధైర్యసాహసం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు బాలలు ఈ పురస్కారానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన బాలల ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించి గౌరవించేందుకు ఈ అవార్డులు అందజేయబడతాయని తెలిపారు. నామినేషన్లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని, అర్హులైన బాలల వివరాలను సంబంధిత అధికారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు గుర్తించి సిఫారసు చేయాలని కోరారు. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగులలోని ప్రతిభావంతులను ప్రత్యేకంగా గుర్తించి నామినేషన్లు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2026 నామినేషన్లకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా, జిల్లా స్థాయిలో పరిశీలన కోసం సంబంధిత వివరాలను జూన్ 30, 2026లోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

# జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా జూన్ 09 (వుదయం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా 2026 జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. సంబంధిత శాఖలు, అధికారులు మరియు న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గరిష్ఠ సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

కొత్తగూడ జూన్ 9 (వుదయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలంలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.? స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొత్త వానిగూడెం గ్రామానికి చెందిన కుంజా నర్సమ్మ అనే మహిళ ఇంట్లో సోమవారం రాత్రి 10:30 గంటలకు ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. క్షణాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. గమనించిన స్థానికులు



మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.? ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు, నగదుతో పాటు గృహోపకరణాలు పూర్తిగా ధ్వంసమవడంతో బాధితురాలు రోడ్డున పడింది. తృటిలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితురాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

# అధికారుల నిర్లక్ష్యంతో విజృంభిస్తున్న అక్రమ మట్టి దందా ప్రభుత్వ ఆదాయానికి గండి

## పర్యావరణానికి ముప్పు.



నర్సంపేట జూన్ 09 (వుదయం ప్రతినిధి) : నర్సంపేట పరిసర ప్రాంతాల్లో అక్రమ మట్టి దందా రోజురోజుకూ పెరుగుతున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల పర్యవేక్షణ లోపంతో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా మట్టిని తవ్వి తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో భారీ యంత్రాల సహాయంతో వ్యవసాయ భూములు, చెరువులు, ప్రభుత్వ స్థలాల నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూముల సారవంతత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ మట్టి రవాణా కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయి. అధిక బరువుతో వెళ్తున్న వాహనాల వల్ల రోడ్లు గుంతలమయమవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో సాధారణ ప్రజలు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని విక్రయించడం వల్ల ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయం నష్టం వాటిల్లుతోందని తెలుస్తోంది. సంబంధిత శాఖల అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వాగులు మరియు వ్యవసాయ భూముల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అక్రమ మట్టి దందాపై ప్రత్యేక దృష్టి సారించకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# మండల సమైక్య బస్సుల ప్రారంభోత్సవానికి భారీగా తరలి వెళ్లిన మహిళా సంఘాలు

## బస్సుల ప్రారంభోత్సవానికి వెళ్తున్న మహిళల బస్సుకు జెండా ఊపిన ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి



ఖానాపురం, జూన్ 9 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల సమైక్యలకు నూతనంగా 553 బస్సులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తున్న కార్యక్రమానికి మండల కేంద్రం నుండి చైతన్య మండల సమైక్య ఏపిఎం రమాదేవి ఆధ్వర్యంలో వివో సంఘాల అధ్యక్షులు ఏఎన్ఎం పోలీస్ సిబ్బంది ఐకెపి సిబ్బందితో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లోని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తరలి వెళ్తున్న మహిళల బస్సును మండల కేంద్రంలోని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారిపై నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు జెండా ఊపి మహిళల బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆత్మ డివిజన్ అధ్యక్షుడు యడ్ల బిక్షంరెడ్డి మహిళా సంఘాల వివో అధ్యక్షులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న పొదెం వీరయ్య



చర్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి): చర్ల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మండల కేంద్రంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మేడిచర్ల. వీరకుమార్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన కలిసి వారి సమస్యలు, స్థానిక అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే, పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పొదెం వీరయ్య సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి వచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు పార్టీ లో అన్నీ వర్గాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు

# ఏఐ, ఆన్లైన్ కోర్సులతో ఇంటర్ బోధన ఉండాలి

## – సూర్యాపేట కలెక్టర్ సూచన



సూర్యాపేట జూన్: 09 వుదయం ప్రతినిధి సమాజం గాడి తప్పకుండా అభివృద్ధి దిశలో పయనించాలంటే దానికి విద్య వ్యవస్థ మూలమని, అలాంటి విద్యా వ్యవస్థ ఉపాధ్యాయులు, ఆధ్యాపకుల చేతిలో ఒక ఆయుధం లాగా ఉన్నదని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉద్బోధించారు.. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులు పాత పద్ధతిలో కాకుండా నూతన రీతులలో యువతను మేల్కొల్పి, పిల్లలు ఆకట్టుకునేలా పాఠాలు బోధించి వారిని ఉన్నత స్థితిలో నిలపాలని సూచించారు. ఒక తరం నుంచి మరో తరానికి మార్పు అనేది అది ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందని గుర్తు చేశారు. విద్యార్థుల జీవితాలను రూపకల్పన చేసే అదృష్టం ఉపాధ్యాయ లోకానికి ఉంటుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు అభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ప్రతి ఒక్కరు సంకల్పంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఏఐ, ఆన్లైన్ కోర్సెస్, ఫిజిక్స్ వాలా తదితర ఇన్నోవేషన్ విధానంలో బోధన ఉండాలన్నారు. ఇంటర్లో ఫలితాలు తగ్గిన దాని గురించి కాకుండా భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికతో ముందుకు సాగుతారనేది ఆలోచించాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు సంకల్పంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ కళాశాల కంటే ప్రభుత్వ కళాశాలలోనే అధ్యాపకులకు, విద్యార్థులకు ఎక్కువ నైపుణ్యం ఉంటుందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు . ఆయా కళాశాల వారీగా గత సంవత్సరం ఫలితాలపై అధ్యాపకులతో చర్చించి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. డిఐఈఓ బి. సులోచన రాణి మాట్లాడుతూ గత సంవత్సరం మొదటి సంవత్సరంలో 60.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 66.83 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు వివరించారు. ఈ విద్యా సంవత్సరం మరింత ఉన్నతమైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాల ప్రిన్సిపల్ పి. యాదయ్య, రాజమోహన్, వెంకటరమణ రెడ్డి,విజయ నాయక్, హరిప్రసాద్, గీతాబాయి, మృత్యుంజయ, వెంకటరమణ లతోపాటు ఆయా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమీషనరేట్

## ఇద్దరికీ ట్రాఫిక్ విధులు నిర్వహించామని శిక్ష విధించిన జడ్జి



పెద్దపల్లి జూన్ 09 (వుదయం ప్రతినిధి) మద్యం తాగి ఆ మత్తులో వాహనాన్ని రోడ్డుపై అతివేగంగా నడుపుకుంటూ పోయే మందుబాబులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే శిక్ష పడటం ఖాయమే. మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ రోడ్లపై తిరిగి ప్రమాదాలకు కారకులు కావొద్దనే ఆలోచనతో చట్టపరంగా కఠినశిక్షలను విధిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిని సోమవారం స్థానిక కోర్టులో హాజరుపర్చాగా.

విచారణ జరిపిన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ చీ మంజుల గారు గొట్టే పవన్ కుమార్, గోసుకుల అశోక్ కు 2 రోజులు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారని ట్రాఫిక్ సీఐ బి. శ్రీనివాస్ తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపే వారి పై కటిన చర్యలు తప్పవని చెప్పారు.

# జిపిఎస్ ట్రాకింగ్ ట్యాగ్ తో ఉన్న రాబందు



చర్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) చర్ల మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం జిపిఎస్ ట్రాకింగ్ తో ఉన్న రాబందు ను గుర్తించిన గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేయడం తో సమాచారం అందుకున్న అధికారులు ఉదయం రాబందు ను స్వాధీనం చేసుకుని దానికి ఉన్న జిపిఎస్ ట్రాకింగ్ ట్యాగ్ ఆధారంగా మహారాష్ట్ర లోని తడోపా పక్షి సంరక్షన కేంద్రానికి చెందినట్లు గుర్తించారు. రాబందు ఎండవేడికి బాగా నీరసం గా ఉందని దాని ఆరోగ్య విషయమై డాక్టర్ ని సంప్రదించడం జరుగుతుందని తెలిపారు ఆహారం అందించడం జరిగిందని. ఆరోగ్య పరిస్థితి మెరుగైన అనంతరం. సంరక్షకన కేంద్రానికి పంపుతామని తెలియజేసిన ఎఫ్ఆర్వో రంజిత్, సెక్షన్ ఆఫీసర్ రాజేష్ తెలిపారు

# వర్తక సంఘం అండగా

## రూ.10,000 నగదు ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని



పినపాక జూన్ 09 (వుదయం ప్రతినిధి) :, పినపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పులపగిరి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి బయ్యారం క్రాస్ రోడ్ వర్తక సంఘం అండగా నిలిచింది. వర్తక సంఘం అధ్యక్షుడు గుండు సురేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు రూ.10,000 నగదు ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని రాజేష్ భార్య దేవకికి స్థానిక సర్పంచ్ అనిత చేతుల మీదుగా అందజేశారు. ఇటీవలే భర్తను కోల్పోవడం, కుమారుడు దివ్యాంగుడు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి మానవతా దృక్పథంతో ఈ సహాయం అందించినట్లు వర్తక సంఘం ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు కమలాకర్, సలహాదారులు వెన్న భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ వెలదండి లక్ష్మణరావు, గంజాయి మురళి, మోహన్‌రావు, డాక్టర్ రాంబాబు, జాడి మహేష్, వేణుగోపాల చారి, గోల్డ్ షాప్ లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మతం మారినా వెనుకబాటుతనం తొలగలేదు

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కమిషన్ చైర్మన్‌కు బిషప్ దుర్గం ప్రభాకర్ వినతి



జూన్ 09 (వుదయం ప్రతినిధి) : దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మంగళవారం న్యూఢిల్లీలోని డా. బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ, దళిత క్రైస్తవులు మతం మారినప్పటికీ వారి సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోలేదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం వారికి కూడా అందేలా ఎస్సీ హోదా కల్పించాలని కోరారు.

దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివక్ష, అవకాశాల కొరత, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సీ హోదా కల్పిస్తే దళిత క్రైస్తవులకు విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల్లో సమాన అవకాశాలు లభిస్తాయని, ఇది సామాజిక న్యాయ సాధనలో కీలక అడుగు అవుతుందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# వి కే సి ఎం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## : ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 9 (వుదయం ప్రతినిధి)వి కే సి ఎం కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీకే సీఎం పిట్ కమిటీ సభ్యులతో కలిసి ప్రాజెక్ట్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులకు అవసరమైన మ్యాన్‌పవర్‌ను పెంచడం, స్పేర్స్ టూల్స్ అందుబాటులో ఉంచడం, కొత్త యంత్రాలను ఏర్పాటు చేయడం, ఆదివారాల సెలవుల అమలు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెయిన్‌కోట్లు, తాగునీటి క్యాన్లు అందించడం, క్యాంటీన్ సదుపాయాలను మెరుగుపరచడం, అలాగే ఆఫ్‌లోడింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రాజెక్ట్ ఆఫీసర్, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపు కుమారస్వామి, విప్లవ్ కుమార్, సకినాల సమ్మయ్య, బిచ్చ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా జిల్లా అభివృద్ధికి

## సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి అన్నారు.



యాదాద్రి భువనగిరి జూన్ 09 (వుదయం ప్రతినిధి) : మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు ఎంపీ చామల కిరణ్ రెడ్డి గారికి వివిధ శాఖల అధికారులు నివేదికలు వారి పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు . ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నందున సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలని, అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు పెద్ద ఎత్తున ప్రచారం చేసి అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా శాఖల్లో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు సద్వినియోగం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్స్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు గ్రామంలో నిరుద్యోగ యువతి యువకుల కోసం జాబ్ మేళా నిర్వహించిన సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్



యాదాద్రి భువనగిరి జూన్ 09 (వుదయం ప్రతినిధి) : గూడూరు గ్రామం బీబీనగర్ మండల్ యాదాద్రి భువనగిరి జిల్లా. గూడూరు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఆదిత్య ఎంటర్ప్రైజెస్ వారి సహకారంతో పదవ తరగతి ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు వీశ్రీవవ్షితీశీఅఙఎ మీఙఅబట్ఝఖ్బతీఅస్త్ర జశీఎఙఝఅం లో ఉద్యోగాల కల్పనకు ఈరోజు గ్రామపంచాయతీ ఆవరణంలో జాబ్ మేళా నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు,బింగి సంజయ్, అంకర్ల శ్రీనివాస్, దొనకొండ శ్రీరాములు, తరుపునూరి అశ్విని బాలరాజ్ గౌడ్, బింగి లావణ్య రమేష్, గ్రామ యువతీ యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామంలో చదువుకున్నవారు ఎవరు ఖాళీగా ఉండకుండా యువతీ యువకులందరూ కూడా ఉద్యోగం చేస్తూ తన కుటుంబానికి అండగా ఉంటూ మీ భవిష్యత్తు లక్ష్యాన్ని చేరే విధంగా మీ యొక్క సంకల్పం ఉండాలన్నారు... ముఖ్యంగా గ్రామంలో ఆడవారు ఉద్యోగం చేస్తూ ఆర్థిక బలంగా ఉన్నప్పుడే కుటుంబాన్ని సరిగ్గా నడిపిస్తూ సంఘంలో గౌరవప్రదంగా ముందుకెళతారని తెలియజేశారు.... గ్రామంలో మహిళా సర్పంచ్ అయినందున మహిళా సాధికారత లక్ష్యంగా ఉపాధి కల్పనకు కృషి చేస్తామని తెలిపారు...

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు

## మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏదులాపురం మునిసిపల్ పరిధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ కరుణగిరి నూతన శాఖ ప్రారంభం



ఖమ్మం, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# విద్యా సంస్థల దోపిడీ అరికట్టాలి



పెద్దపల్లి జూన్ 09 (వుదయం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతులు కల్పించాలి గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలి పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ డిమాండ్ ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (ఇజూా) గారికి విన్నపం ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వినర్ అజయ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, ప్రహరీ గోడలు, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి ప్రాథమిక మౌలిక వసతులు అనేక చోట్ల సరిపడా లేవు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను తక్షణమే కల్పించవలసిందిగా కోరుతున్నాము.అదేవిధంగా, జిల్లాలోని కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయి. ఫీజుల వివరాలను పారదర్శకంగా వెల్లడించకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.అలాగే, కొన్ని పాఠశాలలు విద్యార్థులు తప్పనిసరిగా తమ వద్ద నుంచే లేదా నిర్దిష్ట దుకాణాల నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అక్రమంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు నిర్వహిస్తున్నాయి. ఈ చర్యలు తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయి. ఇంకా, ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా నిర్వహించబడుతున్న పాఠశాలలను గుర్తించి, వాటిపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయవలసిందిగా కోరుతున్నాము.

లేని యెడల రానున్న రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, నాయకులు అజయ్, విగ్నేష్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తా

## ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 09 (వుదయం ప్రతినిధి) జగిత్యాల మండలం మోరపల్లి గ్రామంలో గ్రామ ప్రజల 6 దశాబ్దాల చిరకాల కలను 9 లక్షల నిధులతో ఇండ్ల పై ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులను ప్రారంభించిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లపై 11కేవీ లైన్ ఉండడం చాలా ప్రమాదకరం అని లైన్ షిఫ్టింగ్ కి ప్రజల సహకారం కూడా అవసరం అప్పుడే పనులు చేయడం సాధ్యం అవుతుందని కరెంట్ లైన్ వల్ల ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరూ మరణించారు చాలా బాధాకరం అని ప్రభుత్వ పరంగా పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని రైతులకు 2 ఎకరాలు వరకు రైతు భరోసా నిధులు విడుదల చేశారని దాదాపు 90 శాతం రైతులు చిన్న సన్న కారు రైతులు 2 ఎకరాల లోపు వారే ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ తో ఆహార భద్రత ఇందిరమ్మ ఇళ్లు గొప్ప కార్యక్రమం పేదల సొంతింటి కల సాకారం అవుతుందని గ్రామంలో 60 ఇండ్లు మంజూరు అయ్యాయని గతంలో ఇందిరమ్మ కాలంలో మంజూరు చేస్తే మళ్ళీ నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంజూరు అయ్యాయని ఇందిరమ్మ ఇళ్లకు 50 ఇండ్ల కు గాను గ్రామానికి 2.5 కోట్లు దాదాపు మంజూరు అయ్యాయని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు దేశంలో వరి మొక్కజొన్న అత్యధిక మొత్తంలో కొనుగోలు చేసింది తెలంగాణ లో మాత్రమేనని కేంద్రం మద్దతు ధర ప్రకటనకు మాత్రమే పరిమితం అయిందన్నారు తెలంగాణ లో భూమికి బరువు అయ్యే పంట పండిందని రైతు పక్షపాతి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు ప్రతిపక్ష నాయకులు రాష్ట్రంలో కరువు కు కారణం ముఖ్యమంత్రి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు గ్రామంలో శ్మశాన వాటిక కు పోల్స్ తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి సర్పంచ్ కట్ట రాజేందర్ మాజీ ఎంపిటిసి భూమారెడ్డి మాజీ సర్పంచ్ గంగారం జిల్లా సర్పంచుల ఫోరమ్ బొలిశెట్టి గంగారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి నాయకులు బాల ముకుందం ఏడిఈ జవహర్ నాయక్ ఏఈ శ్రీదర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారెడ్డి,నాయకులు నలువల సురేష్ జైరాం సురేష్ అబ్బారి మల్లేశం గౌడ్ సదానందం వెంకటేష్ రాజేశ్వర్ రావు లింగరెడ్డి కమలాకర్ రావు వేణు లక్ష్మణ్ కాంతయ్య రమేష్ సతీష్ డేవిడ్ కిషోర్ దయల శంకర్ కుసరి అనిల్ పంబాల రాము గిరిధర్ గంగాధర్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అండర్-15 జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన యువ క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పలువురు ఎంపిక



భద్రాచలం, జూన్ 9 (వుదయం ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-15 జిల్లా స్థాయి బాలబాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం భద్రాచలంలోని గ్రివ్ ఎంఎంఏ జిమ్‌లో ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి హాజరైన యువ క్రీడాకారులు తమ ప్రతిభ, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండారి ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో బాలబాలికలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. వివిధ బరువు విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో కే. భావన, ఆర్. అక్షయ భవాని, ఎం. హాసిని అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలో ఆర్. గణేష్, ఎం. గణేష్, ఏ. జోనాతన్, కే. సోహిత్, ఆర్. రేవంత్ తమ పోరాట పటిమతో అందరి ప్రశంసలు అందుకున్నారు. వీరందరూ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-15 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా తరపున ఈ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా స్థాయిలో చూపిన ప్రతిభను రాష్ట్ర స్థాయిలోనూ కొనసాగించి మెరుగైన ఫలితాలు సాధించాలని క్రీడా ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా బండారి ఎల్లయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ బాక్సింగ్ క్రీడపై ఆసక్తి పెరుగుతోందని, సరైన శిక్షణ మరియు ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు తయారవుతారని అన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు.పోటీల నిర్వహణలో బాక్సింగ్ కోచ్‌లు పఠాన్ యాకూబ్, ఎస్.కే. అర్షద్ విశేష కృషి చేశారు. క్రీడాకారులకు సాంకేతిక శిక్షణ అందించడంతో పాటు పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వారు తెలిపారు.కార్యక్రమంలో చీఫ్ ప్యాట్రన్ ఎర్ర కామేష్ విజేతలను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీలలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు.పోటీల అనంతరం విజేతలకు అభినందనలు తెలియజేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారుల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రముఖులు పాల్గొని యువ బాక్సర్లను ప్రోత్సహించారు. జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి భవిష్యత్తులో పతకాలు సాధించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జువ్వాడి బ్రదర్స్



కోరుట్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన జువ్వాడి శేఖర్ రావు ఈ కార్యక్రమంలో జువ్వాడి శేఖర్ రావు తో పాటు అయన సోదరులు తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చేర్మెన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు లు పాల్గొన్నారు

# సీనియర్ సిటిజన్లు సమాజ మార్గదర్శకులు

## జిల్లా రెవిన్యూ అధికారి కే వై ప్రసాద్



జగిత్యాల జూన్ 09 (వుదయం ప్రతినిధి) సీనియర్ సిటిజన్లు పెన్షనర్లు సమాజ మార్గదర్శకులని జిల్లా రెవిన్యూ అధికారి కే వై ప్రసాద్ అన్నారు జిల్లా రెవిన్యూ అధికారిగా నూతనంగా పదవీ భాధ్యతలు స్వీకరించిన కే వై ప్రసాద్ ను అయన ఛాంబర్లో మంగళవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ సంఘాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ పెన్షనర్లు కలిసి పుష్పగుచ్చం అందించి సన్మానించి స్వాగతించారు ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ గతంలో రెవిన్యూ ఉద్యోగుల అధ్యక్షులుగా సేవలు అందించి రిటైర్ అయిన హరి అశోక్ కుమార్ ప్రస్తుతం సీనియర్ సిటిజన్ల పెన్షనర్లకు విశిష్ట సేవలు అందించడాన్ని కొనియాడారు అనంతరం హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వివిధ మండలాల్లో సేవలు అందించి ప్రజా తహసీల్దార్ గా పేరొందిన కే వై ప్రసాద్ జిల్లా రెవిన్యూ అధికారిగా పదోన్నతి పై రావడం పట్ల తమ సంఘాల పక్షాన స్వాగతించారు ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ వెల్మల ప్రకాష్ రావు బాలయ్య సత్యనారాయణ బత్తుల శంకర్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా కొత్త సురేష్



కోరుట్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా నియమితులైన కోరుట్ల పట్టణానికి చెందిన కొత్త సురేష్ కు మంగళవారం నియామక పత్రం అందజేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ

# కేశవాపురం లో ఘనంగా కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ



చర్ల జూన్ 09.06.2026 (వుదయం ప్రతినిధి): చర్ల మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరించిన యంఎల్ఎ డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ (నీరు, అడవి, భూమి) అనే నినాదం హక్కుల పోరాటాలకు ఊతం ఇస్తుందని తెలిపారు. కొమరం భీమ్ చూపిన పోరాట పటిమను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాగా నామకరణం చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు . కొమరం భీమ్ తెలంగాణ గడ్డపై పుట్టిన గొప్ప ఆదివాసీ విప్లవ యోధుడని తెలిపారు. ఆయన 1901 అక్టోబర్ 22 వ తేదీన ఆసిఫాబాద్ జిల్లా జల్దా గ్రామంలో జన్మించారని గోండు కులానికి చెందిన వారు. అడవి సంపదపై పూర్తి హక్కులు ఆదివాసీలకే ఉండాలని తెలిపిన మహనీయుడు. 1940 సంవత్సరం అక్టోబర్ నెల లో నిజాం సైన్యం చేతిలో వీరోచితంగా పోరాడి తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి అమరుడయ్యారు అలాంటి కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. కేశవాపురం సర్పంచ్ కాపుల. శారధ ఉపసర్పంచ్ కూనారపు. సతీష్ కాపుల. నాగరాజు కేశవాపురం, గుంపెన గూడెం, రాళ్ళగూడెం గ్రామస్తుల సహకారంతో కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం అని తెలిపారు. ఇలాంటి మహనీయులను స్మరించుకుంటూ విగ్రహాలు ఏర్పాటు చెయ్యడం ఎంత ముఖ్యమో వాటి నిర్వహణా భాధ్యతలు కూడా తీసుకుని ఆ ప్రదేశం ఎప్పుడూ శుభ్రంగా ఉండే విధంగా గ్రామ యువత, పంచాయతీ సిబ్బంది చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి నల్లపు. దుర్గాప్రసాద్, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు చీమలమరి మురళీకృష్ణ, పోలిన. లంకరాజు, కాపుల. కిష్టార్జున రావు, కాపుల. నాగరాజు, మేడబత్తిన. వాసు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# రైతులకు యూరియా.డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచాలి

## జిల్లా కలెక్టర్‌ను కోరిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా డీఏపీ తదితర ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని కోరుతూ కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని అవసరమైన చోట్ల అదనపు నిల్వలను ఏర్పాటు చేయాలని కోరారు జిల్లాలోని సహకార సంఘాలు ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటేనే పంటల సాగు సజావుగా సాగుతుందని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు కలెక్టర్ కూడా ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు

# జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీతో కేసులను పరిష్కరించుకోండి

## జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్



జగిత్యాల జూన్ 09 (వుదయం ప్రతినిధి) జూన్ 20 2026న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ ప్రజలకు సూచించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్ అదాలత్ లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు సివిల్ వివాదాలు ఆస్తి విభజన కేసులు కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు వైవాహిక వివాదాలు బ్యాంకు రికవరీ కేసులు విద్యుత్ చౌర్యం కేసులు.చెక్ బౌన్స్ కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు జిల్లా పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఇతర అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు తమ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతగా పూర్తి చేయాలి

## అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి



కోరుట్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) ప్రజాపాలన ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా మెట్ పెల్లి మున్సిపల్ పరిధిలో నిర్వహించిన వార్డు సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అభివృద్ధి అవసరాలు సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సూచనలు స్వీకరించారు ఇట్టి సమావేశంలో మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్ లింబాద్రి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ లతో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు అలాగే వార్డు పరిధిలోని మౌలిక వసతులు పారిశుధ్యం తాగునీటి సరఫరా వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి అందిన వినతులు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## -ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల జూన్ 09 (వుదయం ప్రతినిధి) కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మల్లాపూర్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి చెందిన 89 లబ్ధిదారులకు మంజూరైన 89 లక్షల 10 వేల 324 రూపాయల విలువ గల 89 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు ఈ పథకాల ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని ఆడబిడ్డల పెళ్లిళ్ల విషయంలో కేసీఆర్ ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక వినూత్న పథకాలను అమలు చేశారని పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ అమలు చేసిన పథకాలు తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసాయని బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యేడాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు రైతు బంధు రైతు బీమా ఆసరా పెన్షన్లు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కేసీఆర్ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



చండూరు - గట్టుప్పల్,జూన్ 09 (వుదయం): వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి చాపల మారయ్య పిలుపునిచ్చారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నెతో పాటు మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం జిల్లా మహాసభల పోస్టర్లు, కరపత్రాలను సంఘం నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాపల మారయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకై, వారి హక్కుల రక్షణకై నిర్వహించబోయే ఈ జిల్లా మహాసభలను కార్మికులందరూ కదిలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం ముఖ్య నాయకులు కర్నాటి సుధాకర్ , సాగర్ల మల్లేష్, కృష్ణ, నరసింహ, మధు, భారత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


## భద్రాచలం గ్రామపంచాయతీ పాలకమండలి డిమాండ్



భద్రాచలం, జూన్ 9 (వుదయం ప్రతినిధి):సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా తప్పుడు ప్రచారాలు, అసత్య ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భద్రాచలం గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు అధికారికంగా ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ, భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలచే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన వార్డు సభ్యులుగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై నిరంతరం కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. అయితే గత కొంతకాలంగా "ఎఏఎబష్త్రీశ్రీబ" అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తమ అనుమతి లేకుండా ఫోటోలను ఉపయోగించడం, గ్రామపంచాయతీ పాలకమండలి ఆరు నెలల పరిపాలనపై వాస్తవాలకు విరుద్ధంగా పోస్టులు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించేలా పోల్స్ నిర్వహించడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా వార్డు సభ్యుల వ్యక్తిగత విషయాలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం, తరువాత వాటిని తొలగించడం వంటి చర్యలు అత్యంత బాధాకరమని తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులపై విమర్శలు చేయవచ్చని, కానీ వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారాలు చేయడం, కుటుంబ సభ్యులను మానసికంగా వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే ఆయా పోస్టుల కింద కొంతమంది వ్యక్తులు అత్యంత అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. తమపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, వ్యక్తిగతంగా దూషించడం, సామాజికంగా అవమానించేందుకు ప్రయత్నించడం వల్ల తమతో పాటు కుటుంబ సభ్యులు కూడా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులుగా తాము ప్రజల సేవకులమని, ప్రజలు చేసే నిర్మాణాత్మక సూచనలు, విమర్శలను ఎప్పుడూ స్వాగతిస్తామని తెలిపారు. అయితే సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేయడం, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం, మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియా నేటి సమాజంలో ఒక శక్తివంతమైన సమాచార సాధనమని, అయితే కొందరు వ్యక్తులు దానిని బాధ్యతారహితంగా ఉపయోగిస్తూ వ్యక్తుల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత మంది బాధితులు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల సంబంధిత ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నిర్వాహకులను గుర్తించి, పోస్టులు చేసిన వారితో పాటు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తుల వివరాలను సేకరించి, భారతీయ న్యాయ సంహిత (దీచీ) మరియు సమాచార సాంకేతిక చట్టం (ఋ చాఖ్) నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అలాగే సోషల్ మీడియాలో ఉన్న అభ్యంతరకర పోస్టులు, కామెంట్లను తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే పోస్టులు, కామెంట్లు చేయకుండా ఉండాలని గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో భద్రాచలం గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు, పలువురు వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# ఇల్లు ఇప్పిస్తానని డబ్బులు అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయండి

## గోడిశాల రామనాథం



పినపాక ( జూన్:9 వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికీ ప్రభుత్వమే నేరుగా ఇల్లు మంజూరు చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోడిశాల రామనాథం స్పష్టం చేశారు మంగళవారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇళ్ల మంజూరు పేరుతో దళారులు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇల్లు ఇప్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, అర్హత ప్రమాణాల ప్రకారమే జరుగుతుంది అని తేల్చిచెప్పారు. దళారుల బెడద ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పార్టీ నాయకులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయడానికి కట్టుబడి ఉంది. అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మండి. అపోహలకు తావివ్వవద్దు" అని రామనాథం విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం నిజమైన లబ్ధిదారులకు మేలు చేకూర్చడమేనని, మధ్యవర్తుల ప్రమేయానికి తావులేదని ఆయన పునరుద్ఘాటించారు

# 44వ వార్డులో రేపు "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" ప్రజా సమస్యలకు ప్రత్యక్ష పరిష్కారం:కౌన్సిలర్ గునగంటి హేమ సతీష్



సూర్యాపేట జూన్:09 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట మున్సిపాలిటీ 44వ వార్డులో నివసించే ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు 44వ వార్డు కౌన్సిలర్ గునగంటి హేమ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 10, 2026న ఉదయం 9:00 గంటలకు 44వ వార్డు పరిధిలో జరగనుంది. కార్యక్రమంలో వార్డు ప్రజలందరూ పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గునగంటి హేమ సతీష్ కోరారు. శుద్ధమైన తాగునీరు, సుసంపన్న రహదారులు, పరిశుభ్రత, మురుగు నీరు, వెల్తురు, పార్కులు, హరితాభివృద్ధి, ప్రజల సంక్షేమం తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఉ వార్డు నాయకత్వం స్పష్టం చేసింది. "ప్రజల సేవే మా ధ్యేయం అభివృద్ధియే మా లక్ష్యం" అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. బాబాయ్ హెడ్లైన్స్ ఇవ్వండి

# కరీంనగర్‌లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

## భారీగా కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాల స్వాధీనం



కరీంనగర్ జూన్ 09 (వుదయం ప్రతినిధి): కరీంనగర్ మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. మార్కెట్లోని గౌరిశెట్టి రమేష్ మరియు సిద్ధంశెట్టి చక్రపాణి కిరాణం ఉ సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో జరిపిన ఈ సోదాల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలను కనుగొన్నారు. ఈ దాడుల సమాచారాన్ని వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు చేరవేయగా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టాస్క్ ఫోర్స్ బృందం వారి సమక్షంలో సుమారు 47 బస్తాల కారంపొడి (ప్రతి బస్తా బరువు 50 కిలోలు), 2 బస్తాల పసుపు, మరియు 1 బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దుకాణాల నుండి నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ పరీక్షల ఫలితాలు వచ్చే వరకు సదరు స్టాక్‌ను పూర్తిగా సీజ్ చేయడం జరిగిందని, అలాగే ఈ సుగంధ ద్రవ్యాల అమ్మకాలపై పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్ కానిస్టేబుల్ సాయిదీప్ లు పాల్గొన్నారు

# ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలడంతో

## వెంటనే స్పందించిన సర్పంచ్ అనిత



సీతారాంపురం (జూన్:9 వుదయం ప్రతినిధి ) పినపాక మండలం సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని మణుగూరు-- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ అనిత వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో చెట్టును తొలగించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ తక్షణ స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

## ఎదురెదురుగా ఢీకొన్న ట్రాక్టర్, బుల్లెట్



ధర్మపురి,జూన్ 09(వు దయం ప్రతినిధి): ధర్మపురి మండల పరిధిలోని నాగారం గ్రామ శివారులో మంగ ళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన పులి గంగాధర్ (43) ట్యాంకర్ ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమం లో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తన ట్యాంకర్ ట్రాక్టర్‌ను రిపేరు చేయించడం కోసం జగిత్యాలకు బయలుదేరా డు. ట్రాక్టర్ నాగారం గ్రామ శివారు లోని కల్లుమండవ ప్రాంతానికి చేరుకోగానే, ఒక్కసారిగా ముందు టైర్ పేలిపోయింది. దీంతో ట్రాక్టర్ నియంత్రణ కోల్పోయి, ఎదురుగా వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటా ర్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న మర్రిచెట్టు సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న గంగాధర్ సీట్ నుంచి ఎగిరి కిందపడటంతో తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మోటార్ సైకిల్‌పై వెళ్తు న్న మామిడి సాయికృష్ణకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. సమాచా రం అందుకున్న పోలీసులు ఘట నా స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. మృతుడి తల్లి పులి. లింగ వ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

# 'కొయ్యూరు పోలీసుల దాడితో కాలు విరిగిందని ఆరోపణ' కథనానికి స్పందన

## కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐల బదిలీ
## కొత్తగా మహేందర్ కుమార్, కల్యాణ్ నియామకం

మల్హర్, జూన్ 9(వుదయం ప్రతినిధి):ఇటీవల వుదయం పత్రికలో ప్రచురితమైన "కొయ్యూరు పోలీసుల దాడితో కాలు విరిగిందని ఆరోపణ" అనే కథనానికి స్పందనగా కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తాడిచెర్ల గ్రామానికి చెందిన మెరుగు రమేష్‌ను విచారణ పేరుతో తీవ్రంగా కొట్టడంతో కాలు గాయపడిందంటూ బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వుదయం పత్రికలో కథనం ప్రచురితమవడంతో జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించినట్లు సమాచారం. తాజా బదిలీ ఉత్తర్వుల ప్రకారం కొయ్యూరు ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న వి. నరేష్‌ను డీఎస్‌బీ, జయశంకర్ భూపాలపల్లికి బదిలీ చేయగా, ఆడవిముత్తారం ఎస్‌హెచ్‌ఓ పి. మహేందర్ కుమార్‌ను కొయ్యూరు ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. అలాగే ఎ. కల్యాణ్‌ను కొయ్యూరు ఎస్ఐ–2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కొయ్యూరులో విధులు నిర్వహించిన వి. రాజన్ కుమార్‌ను చిట్యాల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ–2గా బదిలీ చేసినట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీలపై స్పందించిన బాధితుడు మెరుగు రమేష్, ఈ బదిలీలతో తనకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న అధికారులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





